# తమసః పరస్తాత్

మనసు ఏమీ బాగుండలేదు – మబ్బువేస్తే బాగుండును అనుకున్నాను : ఫెళ్ళుమంది వెన్నెల...

కళ్ళు కుట్టుతున్నాయి : కంకంటి పాపరాజును కప్పుకున్నాను...నందనవనంలో, పదితలలరాయడు కోడై కొక్కిరించాడు...

...ఎన్నడో మరిచిపోదామనుకున్న...పాడుకథ... నిలవేసి వెక్కిరించడం మొదలుపెట్టుతూంది: కక్కేస్తాను.

—చిన్నది...

...పదిహేడేళ్ళది...

ఆ ఊరూ, అలదాని పేరూ, మీకు అనవసరం లెద్దురూ...

ఆవాళ...ఇవాళ వెన్నెలే:

—అక్కడ అన్నాళ్ళుగా ఉంటున్నందుకు...తిన్న తిండి బాగా వంటపట్టింది.

...ఉన్నవాడిని ఊరుకోకుండా, నిన్న కనుచీకటి వేళ, ఆలా కులుకుతూ పోతూంటే...చూశాను.

ఇవాళ ఉదయం, మసక – మసకలో, తెల – తెలవారుతూండగా, ఇటే, నక్క – నలిగిరావడం...చూశాను.

తిరిగి – తిరిగి చూశాను.

మళ్ళీ నిన్నటివేళకు కాపు వేశాను...నిల వేశాను...
ఒక్క నిమిషం...యుగమై నిశ్శబ్దం...

"ఎవ డీ సై తాన్?" అనుకుంటున్నాయి, ఆ కను గొలుకులు...

..."ఎందు కంత హైరాను, భాయీ?" అంటున్నాడు గజగజలాడే మనలో కామయ్య...

గాజులు పప్పా -పప్పై కంకణ రేకలు జేగురించినవి...

...మబ్బేస్తే ఎంత బాగుండును, అని మనసులో అనుకుందామనుకుంటూండగానే, వెన్నెల మరింత దుమ్మెత్తి పోస్తూంది...

ఎవరో వస్తూన్నట్టుంది...

"ఎవరు వారు?...ఎవ రక్కడ?"

...ఓస్...ఎవరో అనుకుంటిని: ఆ వచ్చేది, రాఘవయ్య. ప్రతిరోజూ, తెల్లవారుజామున, ఆ భక్తుడిగొంతుకలో, మా వీధిపొడుగునా. కృష్ణకర్ణామృతశ్లోకాలు శ్లోకిస్తాయి.

—మాట అనుకోలేదు; పాటకదా పోనీ మనకెందుకు అనుకున్నాను.

రాఘువయ్య - తనకెందుకూ అనుకోలేదు. గొంతు, మరింత చేరువలో చప్పుడుచేశాడు.

అతి – మామూలీ కాముకుడిలాగా ఖంగారుపడి, పట్టు వదిలేశాను...కాని,

పిట్ట ఎగిరిపోలేదు; రాఘువయ్య గొణుగుడుగా దేవుడితో మొరపెట్టుకుంటూ, తనదారిని తాను పోయినాడు.

నేను స్తంభించిపోయినానా?

...నీడలు రెండూ, ఎంతసేపటికీ, ఇంకా విడి - విడి గానే ఉన్నాయి. 'అన్యాయ్, నీ కిది తగదుసుమా!'... అంటుందేమో, 'అయితే చచ్చాముగా దేముడా'...అను కుంటూ పంచప్రాణాలూ...చావుబ్రతుకుల్లో ఉన్నవి.

ఆ చిన్నదానికి నదురూ - బెదురూ లేదు; కాని, చెయ్యన్నా చేసుకోలేదు.

పోనీ తిట్లన్నా నోటికిరావా?—ఊరూనాడూ హడ లేట్టు కేకలువెయ్యలేదా? - సందుదొరికిందే చాలునని, పారిపోలేదా? - ఏమీ చెయ్యలేదు...ఆలాగే, అక్కడే, తన్ను కాదన్నట్టుగా, నిలుచుంది...

ఎంతసేపు, అలా నిలుచోడం? - కాళ్ళు మనస్సులో పరుగెత్తుతూన్నవి; కాని ఒళ్లు మొద్దుబారిపోయి. ఝుల్‌మన డానికన్నా జవలేకుండాపోయింది...

ఈ పిల్లాడూ ఆలాగే నిలుచున్నాడు...

ఎవరు వచ్చేది...రాఘవయ్యేనా?...

"అయితే మానెనలే!"అని హెచ్చరించింది మనస్సు; అక్కడే నిలవేసింది...

ఎవరు వచ్చేది...రాఘవయ్యలాగా లేడే...గొంతు లోలో మోగే సడీ సద్దూ వినబడడంలేదే?

...గాజులు తళుక్కుమన్నవి కాని, గల - గల - చలాకీ లేదు. చీరెఅంచు ఉత్తరీయపు మగసిరితో మీసం దువ్వుతూంది...చీరెకుచ్చెళ్ళు, కాళ్ళకు బందాలుపడటం లేదే...

ఎవరావచ్చేది?...వస్తూన్నది ... రామయ్య అన్న కూఁతురు కాదూ?...

వెన్నెలనీడను ఒళ్లువిరుచుకుంటూన్న చీకట్లోకి... కొండి ఎత్తుకున్న తేలులాగా చర - చరా ప్రాకివచ్చింది... గడ్డకట్టుకుపోయిన పదిహేడేళ్ళు...ఆ కంఠానికి పెనవేసుకు పోయినవి...ఆ కౌగిలింతలో రంగరించుకుపోయినవి...

నేలమీద విడి - విడి నీడ పడకుండా, ఆ అడుగులలో అడుగు ఒదిగి...కళ్ళపాలి మేరలుదాటి ... ఉయ్యాలలూగి పోయింది...

ఆకాశంలో ఎవతో దేవకన్నె నిట్టూర్చింది...ఆపైన ఎవతో ప్రౌఢ ఉసూరుమంది...ఇంకా ఆపైన ఎక్కడో చుక్కల్లో ప్రొద్దుపొడిచింది...వెన్నెల నలిగి పసివాడి పోయింది...పీధి...రోషంతో నన్ను ఇంట్లోకి విసిరేసింది...

ఆవాళ, ఏవేళకూ తెలతెలవారలేదు...ప్రొద్దు నిద్దురలేవలేదు...

మంచులో కణకణలాడిపోతూ మందారగుమ్మ... మరియాదగా ఆకుల్లో అణగి అణగిపడివున్న, జాజిమొగ్గ మీఁదికి రసభారంతో వాలింది...వాలేవట్టుకు ఝుంమ్మన వెదుక్కుంటూన్న తుమ్మెద. తుమ్మెద తోకముడుచుకు పారిపోబోతూంటే మల్లెతీగకు కొట్టుకొని తల బొప్పి కట్టింది...

ప్రకృతి ఒక్కొక్కనాడు, ఒళ్ళుపొగరెక్కి ఒకటో తరగతి వాచకంలాగా...అతి తేలికపాఠాలు చదువుతుంది. మనమందరమూ శుంఠలమనుకుని...ఎంతసేపటినుంచో...

ఎందుకో కిటికీదగ్గర నిలుచున్నాను...సప్తద్వీపాల్లో, ఆలాగే, నాలాగేఎందరునిలుచున్నారో, ఆ వేళప్పుడు...అర్థంలేకుండా.

ఎండతోబాటు, చరచరా నవ్వువచ్చింది...చిన్నప్పుడు దిద్దిన ఓనమాలై...ఆ కథ...ఖజానాలో పడిపోయింది...

—ఆఅమ్మాయి రోజూ అదే వేళకు అలాగే నలిగి...నడచిపోతూండేదా? ఏమో!...ఎన్నాళ్ళనాటి ముచ్చటో...ఇప్పుడు—

—కంకంటి పాపరాజు, గభాలున క్రిందికి దొర్లి, బారసాచుకు ఆవులించాడు...వెన్ను చరిచి...లేని దుమ్ము దులిపి..."ఆ మూల అణగీ మణగీ పరుండు బాబూ." అని బలవంతంగా బుజ్జగించాను...

...మనసు, మరీ అసహ్యంగా...కందింది.

—o—